నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 20 మే 2024 HYDERABAD

## పేద విద్యార్థులకు 'నవద్వీప' చేయూత



కొండాపూర్, మే 19 : పలు అనాథా శ్రమాల్లో ఉంటున్న చిన్నారుల విద్యాభ్యాసానికి హైటెక్‌సిటీలోని మై హోం నవద్వీప ఫౌండేషన్ ఆర్థిక సాయమందించింది. ఆదివారం ఆశ్రమ నిర్వాహకులకు ఫౌండేషన్ సభ్యులు రూ. 2,75,800ల చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నవద్వీప ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ... పలు అనాథ ఆశ్రమాల్లో ఉంటున్న 30 మంది చిన్నారులకు ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన స్కూల్ ఫీజుల కోసం ఆర్థిక సాయమందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే ఎంతో మందికి సాయం చేస్తున్నామన్నామన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆదివారం అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్‌తో పాటు, సాలార్‌జంగ్ మ్యూజియం, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల, ఐఐటీ హైదరాబాద్, తెలంగాణ శిల్పాకారుల సంఘం, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐకోమోస్(ICOMOS) సౌతిండియా జోన్ కాంక్లేవ్ నిర్వహించారు. మ్యూజియం, మ్యూజియాల నిర్వహణ, సాంప్రదాయం- భవిష్యత్ సహకారం, మ్యూజియం ఎడ్యుకేషన్ అండ్ ఇట్స్ ఫ్యూచర్, మ్యూజియం ఎడ్యుకేషన్‌లో టెక్నాలజీ పాత్ర, వాయిస్ ఆఫ్ హెరిటేజ్, జాతీయ పురాతన, సాంస్కృతిక సంపదను వ్యాప్తి చేయడంలో మ్యూజియం పాత్ర, చేతివృత్తులు, డిజిటల్ ఇంటరాక్టివ్ అండ్ మ్యూజియం ఎడ్యుకేషన్ వంటి అంశాలపై నిపుణులు, చరిత్రకారులు, శిల్పకళ నిపుణులు ప్రసంగించారు. -సిటీబ్యూరో

# లోతట్టు..మునగాల్సిందేనా?

## ఎస్‌ఎన్‌డీపీ పనులపై సర్కారు నిర్లక్ష్యం

### ఐదు నెలలుగా పనులు పూర్తి చేయని వైనం

### నత్తనడకన నాలా పూడికతీత పనులు

### బిక్కుబిక్కుమంటున్న ముంపు ప్రభావిత ప్రజలు

వచ్చేది వర్షాకాలం.. పైగా మే నెలలోనే ఉన్నట్టుండి కురుస్తున్న కుండపోత వానలతో నాలాలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతుండటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. వరద ముంపు తప్పించాల్సిన జీహెచ్ఎంసీ మాత్రం ఇంకా మొద్దు నిద్ర వీడటం లేదు. మాన్‌సూన్ పనులే కాకుండా.. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలాల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) మొదటి దశ పనులపైనా నిర్లక్ష్యం చూపుతున్నది. 75 శాతం పైగా పనులను పూర్తి చేసి వందల కాలనీలు, బస్తీలకు వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపింది గులాబీ సర్కారు..కానీ డిసెంబర్‌లో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గత ప్రభుత్వ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపడంతో పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయలేక బల్దియా చేతులెత్తేసింది.

- సిటీబ్యూరో, మే 19, (నమస్తే తెలంగాణ)



ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది వేసవిలో దాదాపు రూ. 45 కోట్ల ఖర్చుతో రూ.884.15 కిలోమీటర్ల మేరలో నాలా పూడిక పనులను చేపట్టాలని నిర్ణయించి, మే 31 నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.అయితే ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, చార్మినార్ జోన్లలో ఏ ఒక్క జోన్‌లో 50 శాతం కూడా పనులు పూర్తి చేయలేదని, కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లింపులు లేకనే పనులు నత్తనడకన జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు ఖైరతాబాద్ జోన్‌లోని ఐదు సర్కిళ్లు మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ ఉండగా, రూ.10.73కోట్లతో 63 పనులు చేపడుతున్నారు. 171.256 కిలోమీటర్లలో 53.96 కిలోమీటర్లు పూర్తి చేశారు. నిర్దేశిత లక్ష్యంలోగా పనులు పూర్తి కావడం కష్టమేనని స్వయంగా ఇంజినీర్లలో చర్చ జరుగుతున్నది. బల్కాపూర్ నాలా డిసిల్టింగ్‌కు సంబంధించి మొత్తం 9.64 కిలోమీటర్లలో 4 కి.మీలు మాత్రమే పూర్తి చేశారు. ఈ క్రమంలోనే ఇప్పటికే సంస్థ పరిధిలో దాదాపు రూ.1350 కోట్ల బకాయిలు ఉన్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు పనులు చేపట్టబోమని కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేస్తూ సమ్మె బాట పట్టారు. ఈ ప్రభావం తాజాగా మాన్‌సూన్ పనులపై పడుతోంది. సకాలంలో పనులు పూర్తికాకపోతే.. వచ్చే వర్షాకాలంలో వరద ముంపు సమస్యలు తప్పేలా లేవు.

**మే 31 నాటికల్లా**

### ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో కనిపించని పురోగతి

ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో పనులు పూర్తి కాకపోతే వర్షాకాలంలో ముంచెత్తే వరద నీటితో బతుకులు అస్తవ్యస్తమయ్యే పరిస్థితులు ఉంటాయన్న భయాందోళనకు గురవుతున్నారు. వాస్తవంగా బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబర్ మాసంలో వరుణుడి బీభత్సం తర్వాత వరద నీటికి శాశ్వత చర్యలు చేపట్టాలని భావించి..ఎస్ఎన్‌డీపీ తొలి విడత పథకం ద్వారా రూ. 985.45కోట్లతో 58 చోట్ల నాలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూ.531కోట్లతో 35 ప్రాంతాల్లో వేలాది కాలనీల వరద ముంపు సమస్యకు పరిష్కారం చూపింది. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎస్ఎన్‌డీపీ పనుల పురోగతిపై సమీక్షించిన దాఖలాలు లేవు. ఖజానాలో డబ్బుల్లేక కాంట్రాక్టర్లకు చెల్లింపులను నిలిపివేశారు. చాలా చోట్ల గోడలు, స్లాబుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫలితంగా రూ. 394.65 కోట్లతో 20 చోట్ల జరుగుతున్న పనులపై తీవ్ర ప్రభావం పడింది. వచ్చే వర్షాకాలం నాటికల్లా ఈ పెండింగ్ పనులు పూర్తి కాకపోతే సరూర్‌నగర్, నాగోల్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, చార్మినార్, చాంద్రాయణగుట్ట హయత్‌నగర్, వనస్థలిపురం, హబ్సిగూడ, ఉప్పల్ రామంతాపూర్‌తో పాటు శివారు ప్రాంతాలైన బడంగ్‌పేట, జల్‌పల్లి, పెద్ద అంబర్‌పేట, మీర్‌పేట ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం పడే అవకాశాలున్నాయి. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో రూ.747.45కోట్లతో 37 ప్రాంతాల్లో పనులకు ఎస్‌బీఐ ద్వారా రూ. 515.96 కోట్ల రుణం తీసుకోగా...మిగిలిన రూ. 231.81 కోట్ల నిధులను జీహెచ్ఎంసీ సమకూర్చాల్సి ఉంది. జీహెచ్ఎంసీ అవతల రూ.238 కోట్లతో 21 చోట్ల జరిగే పనులకు శివారు మున్సిపాలిటీలు నిధుల భారం భరించాల్సి ఉంటుంది. మొత్తంగా నిధుల అడ్డంకితో నాలా అభివృద్ధి పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది.

### కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు లేఖ..

వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలాకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రాస్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ ద్వారా అభ్యర్థించారు. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వానలతో నాలాలు పొంగిపొర్లి ప్రజలకు అసౌకర్యం తలెత్తుతున్నదన్నారు. దీనికి తోడు కాంట్రాక్టర్లు పాటిస్తున్న బంద్‌తో నిర్వహణ పనులపై తీవ్ర ప్రభావం చూపి.. ప్రజల ఇబ్బందులు అధికం అయ్యే అవకాశాలున్నాయన్నారు. ఎర్లీబర్డ్ స్కీంలో భాగంగా ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ. 900కోట్లకు పైగా నిధులు సమకూర్చుకున్నారని, ప్రజలు సహకరిస్తున్నప్పుడు , వారికి అవసరమైన పౌర సదుపాయాలను జీహెచ్ఎంసీ ఎందుకు అందించడం లేదని పద్మనాభరెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించి పనులు ఆగిపోకుండా సకాలంలో వాటిని పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

## హడలెత్తిస్తున్న వానలు

### విరిగిపడుతున్న చెట్ల కొమ్మలు

### చెరువులను తలపిస్తున్న రహదారులు..

### బల్దియా టోల్‌ఫ్రీకి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

### మరో రెండు రోజులు వానలు : వాతావరణ శాఖ

సిటీబ్యూరో: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నగరం హడలెత్తిపోతున్నది. గ్రేటర్‌లోని పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడుతున్నాయి. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బల్దియా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వెల్లువెతున్నాయి. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు సహాయక చర్యలు వేగవంతం చేశాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ, డీఆర్ఎఫ్ సిబ్బంది నిరంతరం పనిచేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, శానిటేషన్, ఇంజినీరింగ్ , యూబీడీ, డీఆర్ఎఫ్, విద్యుత్ అన్ని శాఖల సమన్వయంతో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పడ్డ ముంపు, నీరు నిలిచే ప్రాంతాలు, విరిగి పడిన చెట్లను వెంటనే తొలగించడం, నాలాలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి..ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేసిన దరిమిలా.. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నాయి. వర్షాలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జీహెచ్ఎంసీ కంట్రోల్ రూం నం. 21111111, 100, ట్రాఫిక్ సమస్యలపై పోలీసుల వాట్సాప్, హాక్ ఐ లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### జీహెచ్ఎంసీకి ఫిర్యాదుల వెల్లువ

ఒక్కసారిగా కురుస్తున్న భారీ వర్షాలతో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు 52 ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. చెట్లు, కొమ్మలు పడటం, నాలా పైకప్పు పూర్తిగా ధ్వంసం కావడం, నీరు నిల్వడం వంటివి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందులో 50 ఫిర్యాదులకు పరిష్కారం చూపగా, రెండు చోట్ల సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.



### విరిగిపడిన చెట్లు.. కొమ్మల తొలగింపు..

ఇందిరానగర్, ఏఎస్‌రావు నగర్, ఎంజీబీఎస్, గుడిమల్కాపూర్, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, సోమాజిగూడ, కొత్తపేట, రామంతాపూర్, ఎల్బీనగర్, అలీ కేఫ్, కొత్తపేట, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్, గౌలిపుర, గడ్డిఅన్నారం, అంబర్‌పేట, షేక్‌పేట వద్ద చెట్లు విరిగిపడ్డాయి. డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని విరిగి పడిన కొమ్మలు, నెలకొరిగిన చెట్లను తొలగించాయి. ఆయా ప్రాంతాల్లో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

### సాఫీగా నీరు వెళ్లేలా..

బీహెచ్ఈఎల్ క్రాస్‌రోడ్, లింగంపల్లి రైల్వే స్టేషన్, శిల్పారామం, విప్రో, ప్రశాంత్‌నగర్, ఐడీపీఎల్ చింతల్, తుకారంగేట్, మలక్‌పేట, బయో డైవర్సిటీ, జగద్గిరిగుట్ట, బంజారాహిల్స్, జేఎన్‌టీయూ, ఏఎస్‌రావునగర్, తార్నాక, సుచిత్ర, చంపాపేట, మల్లాపూర్, హస్తినాపురం తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రాంతాల్లో డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలు నీరు నిలిచిన ప్రాంతాల్లో సాఫీగా నీరు వెళ్లేలా చర్యలు చేపట్టి.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాయి.

### ఆదర్శ్‌నగర్‌లో అత్యధికంగా 3.85 సెం.మీలు

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల ఆదివారం మధ్యాహ్నం తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 7గంటల వరకు కుత్బుల్లాపూర్‌లోని ఆదర్శ్‌నగర్‌లో అత్యధికంగా 3.85 సెం.మీలు, కూకట్‌పల్లిలోని బాలాజీనగర్‌లో 3.45, కుత్బుల్లాపూర్‌లో 2.78, బాలానగర్‌లో 2.43, కూకట్‌పల్లి అల్లాపూర్‌లో 1.90, పాతబస్తీ చాంద్రాయణగుట్ట, కందికల్‌గేట్‌లో 1.60, రాజేంద్రనగర్‌లోని భవానీకాలనీ, శివరాంపల్లి, శాస్త్రిపురంలో 1.50, అల్వాల్‌లో 1.13, బోరబండలో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# లాస్ట్‌మైల్ కనెక్టివిటీ..

### నైట్ లైఫ్‌కు అనుగుణంగా.. మెట్రో సేవలు

### ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు కార్యాచరణ

### వేళల పొడిగింపుతో ప్రయోజనం పొందేలా టైమ్ టేబుల్

సిటీబ్యూరో: ప్రయాణికులకు మరింత చేరువ కావాలన్న లక్ష్యంతో హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ కార్యాచరణ చేపట్టింది. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్ మహానగరంలో ప్రజల అలవాట్లు, అవసరాలు, జీవనశైలిలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. ముఖ్యంగా అర్ధరాత్రి 12 గంటల వరకు, ఆ తర్వాత తెల్లవారుజామున 3-4 గంటల నుంచే నగర వాసులు తమ రోజు వారీ కార్యకలాపాల్లో నిమగ్నమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో నగర వాసులకు పూర్తి స్థాయిలో మెట్రో సేవలు అందుబాటులో ఉంచేందుకు ఉన్న అవకాశాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేపట్టారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రజా రవాణా వ్యవస్థల్లో ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు, ఆ తర్వాత మెట్రో రైలు ప్రధానంగా ఉంది. ప్రైవేటు రంగంలో ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్రవాహనాలను గణనీయంగా వినియోగిస్తున్నారు. అయితే రాత్రి పది గంటల నుంచి 12 గంటలు, ఉదయం 4 నుంచి 6 గంటల మధ్య ప్రయాణికులకు ప్రజా రవాణా వ్యవస్థల కొరతను ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మెట్రో కారిడార్లు విస్తరించి..ఉన్న 3 మార్గాల్లో మెట్రో రైళ్ల వేళలను పొడిగించడం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయన్న దానిపై ఇటీవలే మెట్రో అధికారులు ప్రయోగాత్మకంగా సోమ, శుక్ర వారాల్లో రైళ్ల వేళల పొడిగింపును ప్రకటించారు. ఈ సమయంలోనే మెట్రో ప్రయాణికుల పెరుగుదలను అధ్యయనం చేసి, మరింత సమయం పెంచేందుకు అవకాశం ఉన్నదని మెట్రో అధికారి ఒకరు తెలిపారు.

### ప్రత్యేకంగా అధ్యయనం..

ఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నాంపల్లి(హైదరాబాద్) రైల్వే స్టేషన్, బేగంపేట, మలక్‌పేట రైల్వే స్టేషన్‌ల నుంచి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారి కోసం ఎలాంటి సమయాల్లో మెట్రో రైళ్లు అందుబాటులో ఉంచాలన్న దానిపై అధికారులు అధ్యయనం చేశారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో రాత్రి 11-12 గంటల మధ్య, ఉదయం 4-6 గంటల మధ్య ఎక్కువగా దూర ప్రాంతాలకు వెళ్లే వారు అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. మెట్రో నినాదమైన లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా ఇంటి నుంచి బయలు దేరింది మొదలు కొని.. చివరి గమ్యస్థానం చేరే వరకు మెట్రోను ప్రధాన ప్రయాణంగా మార్చుకునేలా.. రైళ్ల వేళల పొడిగింపును ప్రయోగాత్మకంగా చేపట్టారు. కొత్త టైమ్ టేబుల్‌తో ఎక్కువ మంది ప్రయోజనం పొందేలా.. ఆయా ప్రాంతాలు, సమయాలను నిర్ణయించే పనిలో మెట్రో యంత్రాంగం నిమగ్నమైంది.



# గెలుపు ఉత్సాహం..

ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన ఐపీఎల్ చివరి లీగ్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ ఘన విజయం సాధించింది. మరోవైపు మ్యాచ్‌ను చూసేందుకు క్రికెట్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మైదానంలో సందడి వాతావరణం నెలకొన్నది. మ్యాచ్ సాగుతున్నంత సేపు.. ప్రేక్షకులు కేరింతలు కొడుతూ.. తమ అభిమాన క్రీడాకారులను ఉత్సాహపరిచారు.














